www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 16 | అక్టోబర్ | 2026 పేజీలు : 8

## ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ వివక్ష




3లో

# ‘బార్’ కోసం పోటా పోటీ



-దరఖాస్తులతోనే ఎక్సైజ్ శాఖకు రూ. 6.82 కోట్లు ఆదాయం

-నేడు లాటరీ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** బార్ షాపుల లైసెన్స్‌లను దక్కించుకునేందుకు మద్యం వ్యాపారులు పోటీ పడుతున్నారు. ఈ పోటీ తీవ్ర స్థాయిలో ఉంది. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో నూతనంగా ఏర్పడిన రెండు మున్సిపాలిటీలలో బార్ షాపులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఖమ్మం జిల్లా కల్లూరు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో బార్లు నూతనంగా ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో దరఖాస్తు లక్ష రూపాయలుగా నిర్ణయించి ఆ సొమ్మును తిరిగి ఇవ్వనివిధంగా ప్రభుత్వం నిబంధన విధించింది. కల్లూరు బార్ షాపు లైసెన్స్ దక్కించుకునేందుకు 325 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దరఖాస్తుకు లక్ష రూపాయల చొప్పున రూ. 3.25 కోట్ల రూపాయల ఆదాయం ఎక్సైజ్ శాఖకు లభించింది. అశ్వారావుపేటలో బార్ లైసెన్స్ దక్కించుకునేందుకు 357 మంది దరఖాస్తు చేశారు. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.3.57 కోట్ల ఆదాయం లభించింది. ఈ దరఖాస్తుల నుంచి లాటరీ పద్ధతిలో ఎంపిక చేయనున్నారు. శుక్రవారం కల్లూరుకు సంబంధించి ఖమ్మం కలెక్టరేట్‌లోనూ అశ్వారావుపేటకు సంబంధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోనూ లాటరీ నిర్వహించనున్నారు. ఒక పక్క ఎల్‌నినో ప్రభావం మరో పక్క దేశంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం ఇతరత్రా పరిస్థితుల నేపథ్యంలో ప్రతి వ్యాపారం ఒడుదొడుకులను ఎదుర్కొంటున్న వేళ మద్యం వ్యాపారం మాత్రం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. బార్ షాపుల యజమానులు మాత్రం తమకు నష్టాలే వస్తున్నాయని చెబుతున్నప్పటికీ ఎందుకు ఇంతగా పోటీ పడుతున్నారో అర్థం కావడం లేదు. దశాబ్ద కాలంగా

మిగతా 2లో..

### అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగే వరకు

# విశ్రమించేది లేదు

- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని




**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** అగ్రిగోల్డ్ బాధితులకు సంపూర్ణ న్యాయం జరిగే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం శేషగిరిభవన్‌లో గురువారం జిల్లా స్థాయి అగ్రిగోల్డ్ బాధితుల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ రెక్కాడితే గానీ డొక్కాడని చిరువ్యాపారులు రైతులు పేదలు తమ కష్టార్జితాన్ని పొదుపు చేసుకుంటే ఆ సంస్థ నిలువునా మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతపాలకులు నిర్లక్ష్యం కారణంగా ఏళ్లు గడుస్తున్నా బాధితులకు చిల్లిగవ్వకుండా అందకపోవడం దుర్మార్గమన్నారు. లక్షలాది మంది పేద కుటుంబాల వారు ఏజెంట్లు రోడ్డున పడి

మిగతా 2లో..






# మాయమవుతున్న మామిడి తోటలు..!

**-పరుగులు పెడుతున్న పామాయిల్ సాగు**
**-ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తగ్గుతున్న మామిడి విస్తీర్ణం**
**-పర్మిట్ల జారీలో మాయాజాలమా..?**
**-అర్ధరాత్రి వేళ కలప తరలింపుపై అనుమానాలు..?**
**-1/70 చట్ట పరిధిలోని తోటల్లో నరికి సత్తుపల్లి మీదుగా తరలింపు**






**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఒకప్పుడు విస్తారంగా కనిపించిన మామిడి తోటలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. పండ్ల రారాజుగా పేరొందిన మామిడికి గడ్డుకాలం మొదలైంది. రానున్న రోజుల్లో మామిడికాయ కొందామన్న దొరికే పరిస్థితి కనిపించడం లేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో యదేచ్ఛగా మామిడి తోటలు నెలకొరుగుతున్నాయి. మరోవైపు పామాయిల్ సాగు విస్తరిస్తుండటంతో మామిడి తోటల విస్తీర్ణం తగ్గుతున్న పరిస్థితి కనిపిస్తోంది. మామిడి చెట్ల నరికివేత, కలప తరలింపు వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతుంది. అటవీ, గిరిజన ప్రాంతాల్లోని తోటల నుంచి చెట్లను నరికి తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### పర్మిట్ల జారీలో పారదర్శకత ఎక్కడ..?

మామిడి చెట్ల నరికివేతకు, కలప రవాణాకు అవసరమైన అనుమతుల జారీలో పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అనుమతులు పరిమితంగా ఉన్నాయా..? నిబంధనలకు విరుద్ధంగా చెట్ల నరికివేత జరుగుతోందా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒక వేళఅన్ని అనుమతులు సక్రమంగా ఉంటే 1/70 యాక్ట్ పరిదిలోని గ్రామాల నుండి అర్ధరాత్రి వేళల్లో కలపను సత్తుపల్లి మీదుగా తరలించాల్సిన అవసరం ఏమిటన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. రాత్రివేళల్లో జరిగే రవాణాపై సంబంధిత శాఖల అధికారులు దృష్టి సారిస్తున్నారా లేదా అన్నది స్పష్టత రావాల్సి ఉంది.

### 1/70 చట్ట పరిధిలోనూ నరికివేత?...

గిరిజన ప్రాంతాల్లోని 1/70 చట్ట పరిధిలో ఉన్న భూముల్లోని మామిడి తోటల్లో చెట్లను నరికి, సత్తుపల్లి మీదుగా కలప తరలిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ వ్యవహారంలో భూముల హక్కులు, చెట్ల నరికివేతకు సంబంధించిన అనుమతులు, రవాణా పర్మిట్లను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉంది. అధికారుల విచారణ ఏది?మామిడి తోటలు ఎందుకు తగ్గుతున్నాయి? ఎన్ని చెట్ల నరికివేతకు అనుమతులు ఇచ్చారు? వాస్తవంగా ఎన్ని చెట్లను నరికారు? రవాణా చేసిన కలపకు పర్మిట్లు ఉన్నాయా? రాత్రివేళల్లో తరలింపునకు కారణాలేమిటి? అనే ప్రశ్నలకు సంబంధిత శాఖలు సమాధానం చెప్పాల్సి ఉంది. అనుమతుల జారీ నుంచి కలప రవాణా వరకు సమగ్ర విచారణ జరిపితేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. మామిడి తోటల పరిరక్షణకు చర్యలు తీసుకోవడంతోపాటు, అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మామిడి తోటలను దక్కించుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నుంచి భారీగా వ్యాపారులు తెలంగాణ వైపు క్యూ కడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే తల్లాడ, వేంసూరు, కల్లూరు,పెనుబల్లి, సత్తుపల్లి మండలాలతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి, ఆశ్వారావుపేట, దమ్మపేట, చంద్రగొండ మండలాల్లో భారీగా మామిడి తోటలు నేలకొరుగుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని మండలాలు 1/70 యాక్ట్ పరిధిలోనివే కాని ఇక్కడ అటవీ శాఖాధికారులు చెట్ల నరికివేత, తరలింపుపై మౌనం వహించటం పలు అనుమానాలకు తావిస్తుందని పలు పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు.

# వల్లభి పీహెచ్‌సీలో సమయపాలనకు తిలోదకాలు..!

**- ఆరు సబ్‌సెంటర్ల పర్యవేక్షణ పేరుతో వైద్య సేవలకు ఆటంకమా?**
**- రోజువారీ సమావేశాలు..వైద్యుల రాకపోకలపై ఆరోపణలు**
**- రోగులకు తప్పని నిరీక్షణ**
**- వల్లభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలపై స్థానికుల అసంతృప్తి**



**ప్రజాపక్షం/ముదిగొండ:** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వైద్య రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కొన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలోని వల్లభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని స్థానికులు, ఆసుపత్రికి వస్తున్న రోగులు ఆరోపిస్తున్నారు. వైద్యం కోసం ఆసుపత్రికి చేరుకుంటున్న రోగులకు సకాలంలో సేవలు అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

### - సమయపాలన పాటించడం లేదని ఆరోపణలు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం4 గంటల వరకు వైద్య సేవలు అందుబాటులో ఉండాల్సి ఉన్నప్పటికీ, ఆసుపత్రిలో విధుల నిర్వహణపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. వైద్యులు, సిబ్బంది నిర్ణీత సమయానికి విధులకు హాజరవుతున్నారా? రోగులకు నిరంతరంగా వైద్య సేవలు అందుతున్నాయా? అనే అంశాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సినవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. వైద్య పరీక్షలు, చికిత్సలకై దూర ప్రాంతాల నుంచి ఆసుపత్రికి వచ్చే రోగులు వైద్యుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని ఆరోపిస్తున్నారు. అత్యవసరంగా వైద్య సహాయం అవసరమైన వారు ఇలాంటి పరిస్థితుల్లో మరింత ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### - ఆరు సబ్ సెంటర్ల పర్యవేక్షణ..మరి రోగులకు వైద్యం ఎలా?

వల్లభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆరు సబ్ సెంటర్లు ఉండటంతో వాటి పర్యవేక్షణ, క్షేత్రస్థాయి విధులు, రోజువారీ సమావేశాల నిర్వహణ వంటి బాధ్యతలు వైద్యులపై ఉంటున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ అదనపు బాధ్యతల కారణంగా ప్రధాన ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలకు అంతరాయం కలగకూడదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. సమావేశాలు, పర్యవేక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తూనే ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండేలా విధులను సమన్వయం చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా ఆధారపడుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందే ఆర్థిక స్థోమత లేని వారు ప్రభుత్వ వైద్య కేంద్రాలనే ఆశ్రయిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వైద్యులు సమయానికి అందుబాటులో లేకపోతే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు.

### - ఉన్నతాధికారులు స్పందించాలి

వల్లభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవల నిర్వహణ, వైద్యులు, సిబ్బంది హాజరు, పని వేళల అమలు, రోగులకు అందుతున్న చికిత్సలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమగ్రంగా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. అవసరమైతే ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, సమస్యలు ఉన్నట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యతిస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలోనూ అదే లక్ష్యం ప్రతిబింబించాలని, ప్రతీ రోగికి సకాలంలో వైద్య పరీక్షలు, అవసరమైన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. జిల్లా కలెక్టర్, సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఈ అంశంపై దృష్టి సారించి వల్లభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలను మెరుగుపరచాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. వైద్య సేవలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాల్సిన అవసరం ఉంది. వైద్యులు, సిబ్బంది విధుల నిర్వహణపై అధికారిక వివరణ వెలువడితే మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# ‘బార్’ కోసం పోటా పోటీ

**(మొదటిపేజీ తరువాయి)** మద్యం సేవించే వారి సంఖ్య క్రమేపి పెరుగుతూ వచ్చింది. ఒకప్పుడు మద్యం సేవించి తిరగడాన్ని అవమానకరంగా భావించే వారు. ఇప్పుడు మద్యం సేవించడం స్టేటస్ సింబల్‌గా మారింది. గతంలో ఒకట్రెండు సందర్భాల్లో మాత్రమే మద్యం ఏర్పాటు చేసేవారు. ఇప్పుడు పుట్టిన రోజు మొదలు శుభం, అశుభం, వివాహాలు, గృహప్రవేశాల సందర్భంగా కూడా మందు పార్టీలు ఏర్పాటు చేస్తున్నారు. మంచి,చెడు ఏదైనా సరే బంధువులు, ఆత్మీయులను పిలిచి చేయి కడిగించాలన్న ఆలోచన రాగానే దానితో పాటే మందు పార్టీ ఆలోచన పుట్టుకొస్తుంది. అందుకే మద్యం వ్యాపారంలో భారీ పోటీ పెరిగింది. మద్యానికి తోడు మత్తు పదార్థాల వాడకం కూడా పెరిగి చాలా సందర్భాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితి ఏర్పడింది.

## అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగే వరకు విశ్రమించేది లేదు

**(మొదటిపపేజీ తరువాయి)**తీవ్ర మానసిక క్షోభతో ప్రాణాలు కోల్పోతుంటే ప్రభుత్వాలు చోద్యం చూడటం భావ్యం కాదన్నారు. సంస్థకు సంబంధించిన వేలకోట్ల విలువైన ఆస్తులను వెంటనే వేలం వేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితుల సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ యాజమాన్యం బినామీ పేర్లతో దాచిపెట్టిన ఆస్తులను గుర్తించి తక్షణమే ప్రభుత్వం స్వాదీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ కంపెనీ మోసాలను తట్టుకోలేక మరణాలకు పాల్పడిన బాధితులు ఏజెంట్ల కుటుంబాల వారికి రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలన్నారు. బాధితుల పక్షాన అసెంబ్లీలో గళమెత్తడంతోపాటు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పూర్తి నాయ్యం దక్కేలా ఉద్యమిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు వీశంశెట్టి పూర్ణచంద్రరావు, రైతు సంఘం జిల్లా నాయకులు వైఎస్ గిరి, తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నాయకులు, బాధితులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ దంపతులకు సన్మానం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో మహాలక్ష్మి అమ్మవారి దసరా ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ వేముల నాగరాజు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రెండో వార్డు కౌన్సిలర్ తిరుపతి శివకుమారి, శ్రీను దంపతులు ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా కౌన్సిలర్ తిరుపతి వివకుమారి, శ్రీను దంపతులు మాట్లాడుతూ మహాలక్ష్మి అమ్మవారి ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు కూడా తమ సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు, రెండో వార్డు ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

## రోళ్లగడ్డలో మద్య నిషేధంపై ఏకగ్రీవ తీర్మానం



**ప్రజాపక్షం/గుండాల:** రోళ్లగడ్డ గ్రామ పంచాయితీ పరిధిలో ఈనెల 22నుంచి మద్య నిషేధం అమలు చేయాలని సర్పంచ్ భూక్య మంగమ్మ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. రోళ్లగడ్డ, రోళ్లగడ్డ తండా, దేవళ్లగూడెం, నర్సాపురం తండా, నర్సాపురం గ్రామాల్లో గుడుంబా తయారీ, బెల్ట్ షాపులను అరికట్టాలని నిర్ణయించారు. గుడుంబా తయారీదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే మొదటి సారి రూ 25వేలు, రెండోసారి రూ 50వేలు జరిమానా విధించనున్నారు. బెల్ట్ షాపుల నిర్వాహకులకు మొదటి సారి రూ 50వేలు, రెండో సారి రూ లక్ష జరిమానా విధించాలని తీర్మానించారు. మద్య నిషేధం అమలును పర్యవేక్షించేందుకు సర్పంచ్ అధ్యక్షతన, పంచాయితీ కార్యదర్శి కన్వీనర్‌గా 16 మందితో కమిటీ ఏర్పాటు చేశారు. ప్రజల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం కోసం చేపట్టిన ఈ నిర్ణయానికి గ్రామస్తులంతా సహకరించాలని సర్పంచ్ కోరారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల లో 2004 2006 సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదివిన ఆర్ట్స్ విద్యార్థులు 20 సంవత్సరాల తర్వాత ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు అలనాటి జ్ఞాపకాలను, మధుర క్షణాలను, చిలిపి చేష్టలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అప్పటి ప్రిన్సిపల్ బండి రామచంద్రా రెడ్డి, ప్రస్తుత నేలకొండపల్లి ప్రిన్సిపల్ ఎల్ వెంకటేశ్వర్లు, కామర్స్ లెక్చరర్ సరళ ఝాన్సీ రాణి, ఇంగ్లీష్ లెక్చరర్ రాజగోపాల్, హిస్టరీ లెక్చరర్ వినోద్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జీనుగు రత్నాకర్ లను విద్యార్థులు సన్మానించారు.

## చాగంటి సీతమ్మకు నాయకుల నివాళి



**ప్రజాపక్షం/కారేపల్లి:** కొత్త కమలాపురం గ్రామానికి చెందిన మాజీ సొసైటీ డైరెక్టర్ చాగంటి కోటయ్య తల్లి సీతమ్మ ఇటీవల మృతి చెందగా, గురువారం నిర్వహించిన దశదిన కార్యక్రమంలో పలువురు నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మండల వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, మండల నాయకుడు అజ్మీర వీరన్న, మాజీ ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు ధరావత్ పాండ్యానాయక్, సొసైటీ డైరెక్టర్ కోలేటి రాధాకృష్ణ, తదితరులు కోటయ్యతో పాటు ఆయన సోదరులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఈకార్యక్రమంలో మాజీ రైతుబంధు కన్వీనర్ గుగులోత్ శ్రీను నాయక్, తోటకూరి వెంకటేశ్వర్లు, కొత్త తిరుపతయ్య, దుద్దిపాళ్ల భాస్కరరావు, గుగులోతు హరు నాయక్, వెంకయ్య, రాజు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ వివక్ష




**-లాటరీ పద్ధతిలో నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలి**
**-ఈనెల 22న కలెక్టరేట్ వద్ద సర్పంచులతో కలిసి ఆందోళన**
**-విపక్షాల నిర్ణయం**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఇందిరమ్మ పథకం లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ వివక్ష చూపుతున్నారని, నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుందని విపక్షాలు ఆరోపించాయి. లబ్ధిదారుల జాబితా తయారు చేసి లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశాయి. సిపిఐ, సిపిఎం, బిఆర్ఎస్, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల సంయుక్త సమావేశం గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇందిరమ్మ పథకం లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి సరైంది కాదని కండువ కప్పుకున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలనే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారని సమావేశంలో పాల్గొన్న నేతలు ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన నియమ నిబంధనలను పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ కార్యకర్తలు ఇచ్చిన జాబితాలనే యథాతథంగా ఆమోదిస్తున్నారని అధికారులు ఆ జాబితాలో అనర్హులు ఉన్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ తీరు మార్చుకోవాలని సూచించారు. ఈ నెల 22న సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కలిసి వచ్చే రాజకీయ పార్టీలతో ఆందోళన నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఈనెల 22న కలెక్టరేట్ ఎదుట జరిగే ఆందోళనకు పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు హాజరై జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి తాతా మధుసూదన్, మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకటవీరయ్య, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జెడ్పి మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, వివిధ పక్షాల నేతలు యర్రా బాబు, బెల్లం వేణు, ఆవుల అశోక్, శింగు నర్సింహారావు, పర్సా రాంచందర్‌రావు, బానోత్ కొండ, శివరామకృష్ణ, తాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

**-చిమ్మపుడిలో ఘనంగా మహిళా కిసాన్ దివాస్**

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** వ్యవసాయ సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని మహిళా రైతులు ఆర్థిక సాధికారత సాధించాలని ఆత్మ ఖమ్మం ప్రాజెక్టు డైరెక్టర్ పి.సరిత తెలిపారు. మహిళా రైతుల భాగస్వామ్యాన్ని గుర్తించి వారిలో అవగాహన పెంచే లక్ష్యంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామంలో మహిళా కిసాన్ దివాస్ వేడుకలను సర్పంచ్ కొటేరు నర్సిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా రైతులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పిడి సరిత మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర వెలకట్ట లేనిదన్నారు. మహిళా రైతులు సంఘటితమై రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా (ఎఫ్‌పివోఎస్) ఏర్పడాలన్నారు. పండించిన పంటను నేరుగా విక్రయించకుండా విలువ జోడించి మార్కెటింగ్ చేసుకుంటే అధిక ఆదాయం వస్తుందన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను ఇచ్చే అపరాలు, కూరగాయల సాగుపై దృష్టి




సారించాలన్నారు. ఏడిఏ వాణి మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో మిరిప తదితర పంటల్లో తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యలు, చీడ పీడల నివారణ, పంటల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. సర్పంచ్ నర్సిరెడ్డి మాట్లాడుతూ విత్తనం నాటే నాటి నుంచి కోతల వరకు మహిళలే వ్యవసాయానికి వెన్నుముకగా నిలుస్తున్నారన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో సాగు చేపట్టాలన్నారు. అనంతరం పలువురు మహిళా రైతులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఏవోలు అరుణ జ్యోతి, కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి, ఏఈవో కార్తీక్, వార్డు సభ్యులు, మహిళా రైతులు పాల్గొన్నారు.












# ముందు చూపులేని ముఖ్యమంత్రి



**-ప్రభుత్వ వైఫల్యాన్ని ఎల్‌నినోతో కప్పిపుచ్చుకునే ప్రయత్నం**
**-విద్యుత్ సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం**
**-మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుభవం లేని పాలన, ముందు చూపులేని తనంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ధ్వజమెత్తారు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర టిఆర్ఎస్ నాయకులు సండ్ర వెంకట వీరయ్య. గురువారం సత్తుపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ సరఫరా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, తన వైఫల్యాలకు అధికారులను బాధ్యులుగా చూపడం సరికాదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాను మెరుగుపరిచి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గత నెల రోజులుగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలపై ప్రజలు, రైతులు సబ్‌స్టేషన్ల ఎదుట ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపకుండా అధికారులపై నెపం నెట్టడం పాలనా వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. అధికారులపై పట్టు సాధించలేకపోతున్న ముఖ్యమంత్రి "మీరు నా మాట వినట్లేదు" అంటూ వ్యాఖ్యానించడం పాలనలోని వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. గోదావరిఖనిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సింగరేణి బొగ్గు ఉత్పత్తి, విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన వాస్తవాలను ప్రజల ముందుంచే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా ఢిల్లీ పర్యటనలు, రాజకీయ కార్యకలాపాలకే ముఖ్యమంత్రి ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో విద్యుత్ కొరతతో ఇబ్బందులు ఎదురుకాగా, కేసీఆర్ నాయకత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకువచ్చిందని సండ్ర పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 7,778 మెగావాట్ల నుంచి 19,450 మెగావాట్లకు పెరిగిందని తెలిపారు. విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని విస్తరించినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాను మెరుగుపరిచి వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ అందించాలని సండ్ర వెంకట వీరయ్య కోరారు. రాజకీయ విమర్శలు, అధికారులపై నిందలు వేయడం పక్కనపెట్టి ప్రజలు, రైతుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని అన్నారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణ రెడ్డి, కూసంపూడి రామారావు, మల్లూరి అంకమ్మరాజు, అమరవరపు కృష్ణారావు, మోదుగు పుల్లారావు, బెల్లంకొండ రాము, చాంద్ పాషా, పర్వతనేని వేణు, వల్లభనేని పవన్, నడ్డి ఆనందరావు, మేకల నరసింహారావు, జొన్నలగడ్డ విజయ్, మోరంపూడి శివ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాని కరువు జిల్లాగా ప్రకటించాలి

**ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి**

**ప్రజాపక్షం/చింతకాని :** తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఖమ్మం జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని తక్షణమే ఖమ్మం జిల్లాని కరువు జిల్లాగా ప్రకటించి ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలని ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు డిమాండ్ చేశారు. గురువారం చింతకాని మండలం కొదుమూరు గ్రామంలో ఏఐకేఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా కొండపర్తి మాట్లాడుతూ ఇప్పటికే రైతులు ఒక్కో ఎకరానికి వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టారని పంట చేతికొచ్చే పరిస్థితి లేదని ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.తక్షణం కరువు ప్రాంతంగా ప్రటించి సాగర్, గోదావరి జలాలతో చెరువులు, కుంటు నింపాలని ఆయన డిమాండ్ చేశారు. యూరియా యాప్‌ను రద్దుచేయాలని కోరారు. సన్న వడ్లకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం మద్దతు ధరను పెంచాలని , కైలు రైతులను గుర్తించి తక్షణమే వారిని ఆదుకోవాలని డిమండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా




వర్కింగ్ ప్రెసిడెంట్ కూచిపుడి రవి, మండల అధ్యక్షులు దొబ్బల వెంగళరావు, సిపిఐ శాఖ కార్యదర్శి నీరుడు గోవిందరావు, సహాయ కార్యదర్శి చల్లగుండ్ల సాయి, నాయకులు నారపోగు నాగార్జున, అనిల్, మాజీ ఉపసర్పంచ్ కోటగిరి పరభూషణాచారి, కూచిపుడి వెంకటేశ్వర్లు, నూకల నాగయ్య, జగనూల వెంకటేశ్వర్లు, ఖాదర్‌బాబు, నారపోగు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఊరు వాడా బతుకమ్మ ఉత్సవాలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో బతుకమ్మ ఉత్సవాలను ప్రజలు మహిళలు ఘనంగా జరుపుకుంటున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలలో ఈనెల 10 వ తేదీ నుంచి ఊరువాడ పల్లె పలు గ్రామాలు బతుకమ్మలను పలు రకాల పువ్వులతో పేర్చి పలు పాటలతో నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. అమ్మవారు విగ్రహాలను ప్రదర్శించి అమ్మవారికి పూజలు చేస్తున్నారు. అన్ని శాఖల వారు కార్యాలయ ఆవరణలలో బతుకమ్మ సంబరాలను ఉత్సాహంగా ఉల్లాసంగా, ఆట పాటలతో, కోలాట నృత్యాలతో నిర్వహిస్తూ ఆధ్యాత్మికత చాటుకుంటుంది. దీంతోపాటు గ్రామాలలో అమ్మవారు విగ్రహాన్ని ప్రతిష్ఠించడం గ్రామీణ ప్రాంతాలలో కతోలిక క్రైస్తవులు మరియ తల్లి స్వరూపంతో ఊరేగింపులు కుటుంబ ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. హిందువులు, క్రైస్తవులు, పలు మతాలవారు వారికి ఇష్టమైన దేవుళ్లను పూజిస్తూ గ్రామాలలో అన్ని మతాలవారు సామాజిక వర్గాల వారు వారికి ఇష్టమైన దేవుళ్లను ప్రదర్శిస్తూ పూజలు చేస్తున్నారు. ఈనెల 22వ తేదీ వరకు హిందువులు బతుకమ్మ లతో ఉత్సవాలు క్రైస్తవులు ఈనెల 31 వరకు మరియ తల్లి స్వరూపంతో ఊరేగింపులతో పాటు అయ్యప్ప భక్తులు, హనుమాన్ భక్తులు, దుర్గామాత భక్తులు ప్రత్యేక పూజల్లో లీనమై ఉన్నారు. దీంతో పువ్వులకు గిరాకీ పెరిగింది. ఇదే అదునుగా పువ్వుల వ్యాపారులు అదనపు బాదుడు బాదుతున్నారు.

# అసంపూర్తి రహదారితో ప్రమాదాలు

**సింగరేణి అధికారుల నిర్లక్ష్యంపై బీజేపీ ఆగ్రహం**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణం నుంచి విజయవాడ వైపు వెళ్లే మార్గంలో నూతన రహదారి నిర్మాణం పూర్తికాకముందే రాకపోకలకు అనుమతించడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బానోత్ విజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారిపై కంకర రాళ్లు, మట్టి, గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇటీవల ఓ ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అప్పటివరకు హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమస్యపై సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ స్పందించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అధి



కారులు నిర్లక్ష్యం కొనసాగిస్తే ప్రజల తరఫున బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం చేపడతామని హెచ్చరించారు.

# చెట్లు నరికివేతకు పాల్పడిన ఇద్దరిపై కేసు

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం ఎంపీడీవో కార్యాలయంలో చెట్లు నరికివేతపై అక్రమ రవాణా లో ఇద్దరు పై చేసిన నమోదు చేసినట్లు ఫారెస్ట్ రేంజర్ తల్లాడ అధికారిని తెలిపారు. ఈ నెల 13వ తేదీ ఎంపీడీవో కార్యాలయంలో పది చెట్లు నరికి వేతపై కల్లూరు మండలం రఘునాథగూడెంకు చెందిన కుక్క రానా, ఎంపీడీవో చంద్రశేఖర్ ల పై కేసు నమోదైనట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.వివరాలు ఇలా ఉన్నాయి.. ఎంపీడీవో కార్యాలయంలో 13వ తేదీ కార్యాలయ ఆవరణలో పది చెట్లు నరికివేతపై ఆప్తె కలప మాయంపై దినపత్రికలలో రావడంతో అటవీశాఖ అధికారులు రెండు రోజులపాటు విచారణ చేసి చేదించారు. దానిలో నిందితులుగా ఇద్దరిని గుర్తించి వారు ఇరువురుపై కేసు నమోదు చేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూముల్లో చెట్లను సంరక్షించడం, ప్రతి ఒక్కరి బాధ్యత అని, అనుమతి లేకుండా చెట్లను నరికి వేయడం లేదా చట్టం విరుద్ధంగా కనుక రవాణా చేయడం వంటి చర్యలకు పాల్పడకూడదని అటవీశాఖ అధికారులు ప్రజలను కోరుతున్నటు లతెలిపారు. 2002 1970 లోని అటవీ శాఖ చట్ట ప్రకారం ఈ చర్యలు తీసుకున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

# విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



**ప్రజాపక్షం/చింతకాని :** చింతకాని మండలంలోని పలు గ్రామాల్లో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను డిఈ శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో రైతులతో డిఈ మాట్లాడుతూ ఎలినినో ప్రభావంతో విద్యుత్ వినియోగం పెరిగిందని వర్షాభావ పరిస్థితుల్లో రైతులు ఆరుతడి పంటలు సాగుచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోనకల్ ఏడిఈ వైవి ఆనంద్ కుమార్, చింతకాని ఏఈ చావా శ్రీధర్ , సీపీఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, విద్యుత్ సిబ్బంది వేణు, రైతులు పాల్గొన్నారు.

# కుళాయి నీటిని వృథా చేస్తే డమ్మీలు వేస్తాం




**ప్రజాపక్షం/కల్లూరు:** ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో కల్లూరు మున్సిపాలిటీలో ప్రజలందరూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని మున్సిపాలిటీ కమిషనర్ జి సాయి కృష్ణారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని గృహాలకు ట్యాప్ కనెక్షన్ల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటిని ప్రజలు అవసరమైన మేరకే వినియోగించుకోవాలని నీటిని వృథా చేయకుండా ప్రతి నీటి బొట్టును విలువైనదిగా భావించి బాధ్యతగా ఉండాలని, గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. టాప్ కలెక్షన్ల ద్వారా నీటిని వృథా చేస్తే పర్యవేక్షణలో దొరికితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరినైనా ఎలాంటి వారినైనా వదిలేది లేదని వివరించారు.

# పోలీస్ సిబ్బందికి కంటి పరీక్షలు



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండే పోలీస్ సిబ్బంది కంటి చూపుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. గురువారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో డాక్టర్ అగర్వాల్స్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో పోలీస్ సిబ్బందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాని సిపి సునీల్‌దత్ ప్రారంభించి సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. కంటి చూపు సమస్య ప్రారంభ దశలో గుర్తించి అవసరమైన వైద్య చికిత్స పొందటంతో సమస్యను నివారించవచ్చన్నారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్నవారు వైద్యుల సలహామేరకు చికిత్స పొందాలని సూచించారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమం కోసం శాఖ తరుపున అవసరమైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి భోజా రామానుజం, కుమారస్వామి, ఏఆర్ ఏసిపిలు నర్సయ్య, సుశీల్‌సింగ్, కంటి వైద్యుడు పాశం మహేష్, రిజర్వు ఇన్స్‌పెక్టర్లు కామరాజు, సురేష్, శ్రీశైలం, సాంబశివరావు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు వెంటనే పనులు కల్పించాలి

**దండు ఆదినారాయణ**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండలంలోని ఉపాధి హామీ కూలీలందరికీ వెంటనే పనులు కల్పించి, రోజువారీ కూలి రూ.600/ చెల్లించాలని తెలంగాణ వ్యవ సాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) ఖమ్మం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దండు ఆదినారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సత్తుపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న సోషల్ ఆడిట్ సందర్భంగా డీఆర్డీఏ పీడీని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. బేతుపల్లి గ్రామంలో పనులు చేసిన కూలీలకు ఆరు నెలలైనా వేతనాలు చెల్లించలేదని, ఐదు కిలోమీటర్లకు మించి వెళ్లి పనిచేసిన వారికి ప్రయాణ ఖర్చులు అందలేదని ఆయన పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు లేని గ్రామాల్లో వెంటనే నియమించాలని, పని ప్రదేశాల్లో టెంట్లు, మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని కోరారు. గడ్డపారకు రూ.20, తట్టకు రూ.10, పారకు రూ.10 చొప్పున రోజువారీ అదనపు భత్యం ఇవ్వాలని, రెండుసార్లు ఫోటోలు తీసే ఎంఎంఎ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కూలీలకు ఏడాదికి 200 రోజుల పని కల్పించాలని కోరారు. కూలీల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వరరావు, ఉపాధి హామీ ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి



**-ఏఐటియుసి నాయకులు శింగు నర్సింహారావు**

ప్రజాపక్షం/ ఖమ్మం : ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష విడనాడి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటియుసి జాతీయ సమితి సభ్యులు శింగు నర్సింహారావు డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు పాలకులు తాత్సారం చేస్తున్నారని ప్రధానమైన రంగాలకు సంబంధించిన ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూల వైఖరి ప్రదర్శించడం లేదని ఆయన ఆరోపించారు. గురువారం ఖమ్మం కలెక్టరేట్ వద్ద గల ధర్నాచౌక్‌లో సమ్మె చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెకు ఏఐటియుసి పక్షాన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ వైద్య రంగంలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పేరుతో ఉద్యోగులను నియమించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. దేశ వ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎంలో 17 లక్షల మంది పని చేస్తుండగా తెలంగాణలో 17వేల మంది దశాబ్ద కాలంగా పనిచేస్తున్నారని శింగు నర్సింహారావు తెలిపారు. వీరి భవిష్యత్తును పాలకులు అంధకారంగా మార్చారని గత్యంతరం లేక శ్రమ దోపిడీకి గురవుతున్నారని వీరికి కనీసం పిఎఫ్, ఈఎస్ఐ తదితర చట్టబద్ధ హక్కులు ఏవి అమలు కావడం లేదని ఆయన తెలిపారు. కనీసం హెల్త్ కార్డు లు కూడా లేవని కొన్ని రాష్ట్రాలు వీరిని పర్మినెంట్ చేశారని రాష్ట్రంలో కూడా పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగులను బెదిరించడం సరికాదన్నారు. మద్దతు తెలియజేసిన వారిలో ఏఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

# సందడి సందడిగా బతుకమ్మ

**-బిఆర్ఎస్ కార్యాలయంలో కోలాహలం**
**-గ్రామాల్లో ఆటా పాటల జోరు**



ప్రజాపక్షం/ ఖమ్మం : బతుకమ్మ ఇప్పుడు కొత్త జోష్ నింపుతుంది. ఎక్కడ చూసినా సందడి సందడిగా కనిపిస్తుంది. ముఖ్యంగా స్థానిక రాజకీయ నాయకులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని దుర్గామాత విగ్రహాలను ఏర్పాటు చేయించి మండపాల వద్ద భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం కాగానే డిజెలతో పల్లె వాతావరణం సందడి సందడిగా మారింది. ఎక్కడ చూసినా బతుకమ్మ పాటలు అలరిస్తున్నాయి. నగరాలు,పల్లెలు అనే తేడా లేకుండా సాయంత్రం కాగానే బతుకమ్మ ఆటలు ఆడుతూ కోలాటాలు వేస్తూ ఉల్లాసంగా గడిపేస్తున్నారు. ముఖ్యంగా ఖమ్మంలో బిఆర్ఎస్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బతుకమ్మ ఆటకు విశేష ఆదరణ లభిస్తుంది. ఎంఎల్‌సి తాతా మధు నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ బతుకమ్మ సంబురాలకు వందలాది మంది ప్రతి రోజూ హాజరవుతున్నారు. రూరల్ మండలం ఆరెంపుల గ్రామంలో ప్రభాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబురాలకు వందల సంఖ్యలో గ్రామస్తులు హాజరై ఉత్సావాల్లో పాల్గొంటున్నారు. బతుకమ్మతో గ్రామాలు కొత్తశోభను సంతరించు కుంటున్నాయి.

# అధికారులు వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలి

**మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత**



ప్రజాపక్షం/మధిర: అధికారులు కార్యాలయాలకే పరిమితమైతే ప్రజా సమస్యలు కాగితాలకే పరిమితమవుతాయి. క్షేత్రస్థాయిలో అడుగుపెట్టి మూలాలను గుర్తిస్తేనే ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత స్పష్టం చేశారు. పట్టణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని ఆమె హెచ్చరించారు. గురువారం మధిర మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో ఆమె పర్యటన చేపట్టారు. ఈ పర్యటనలో వైస్ చైర్మన్ కోన ధనికుమార్, ఆ వార్డు కౌన్సిలర్ యన్నంశెట్టి అప్పారావు, మున్సిపల్ కమీషనర్ శామ్యూల్‌పాల్‌తో పాటు వివిధ శాఖల అకీలక అధికారులను వెంటబెట్టుకొని ఆమె వార్డులోని ప్రతి సందు, ప్రతి గల్లీని కాలినడకన కలియతిరుగుతూ స్థానిక పరిస్థితులను, ఇబ్బందికర అంశాలను స్వయంగా పరిశీలించారు. ఎక్కడెక్కడ ఏ సమస్య పేరుకుపోయింది? ప్రజలు ఏయే ఇబ్బందులతో సతమతమవుతున్నారు? అనే వివరాలను కౌన్సిలర్‌ను, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డులో నెలకొన్న తాగునీరు, వీధిదీపాలు, పారిశుద్ధ్యం వంటి వివిధ సమస్యలపై ఆమె అధికారులతో మాట్లాడారు. ప్రజాక్షేత్రంలో పర్యటించి ఈ సమస్యలను మూలాల నుంచి గుర్తించాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. అలాగే, వార్డులో దెబ్బతిని పాడైపోయిన రోడ్ల దుస్థితిపై ఆమె స్పందిస్తూ ఆ రోడ్ల సమస్యను త్వరలోనే శాశ్వతంగా పరిష్కరిస్తామని అన్నారు. ఈ పర్యటనలో కౌన్సిలర్ రమణ నాయక్, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం



**కంటి వైద్య పరీక్షలు, దంత వైద్య పరీక్షలు**
**ఈ నెల17న వైరా కమ్మవారి కళ్యాణ మండపంలో మహిళలు, పురుషులకు వైద్య పరీక్షలు**
**ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: కట్టా కృష్ణార్జునరావు**

ప్రజాపక్షం/వైరా: క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి, బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైరాలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించనున్నారని కమ్మజన సేవా సమితి అధ్యక్షులు కట్టా కృష్ణార్జునరావు తెలిపారు. గురువారం కమ్మవారి కళ్యాణ మండపం నందు కమ్మజన సేవా సమితి నిర్వాహకులతో కలిసి కట్టా కృష్ణార్జునరావు మాట్లాడుతూ కమ్మజన సేవా సమితి వైరా, కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల17వ తేదీ శనివారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు వైరాలోని కమ్మవారి కళ్యాణ మండపంలో శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో మహిళలు, పురుషులకు క్యాన్సర్ నిర్ధారణకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. అదేవిధంగా క్యాన్సర్ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా చికిత్స మరింత సమర్థవంతంగా అందించే అవకాశం ఉంటుందని, శరీరంలో అసాధారణ మార్పులు కనిపించినప్పుడు వైద్యులను సంప్రదించాలని తెలిపారు. క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించడంతో పాటు వ్యాధి నిర్ధారణ పరీక్షలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా కంటి వైద్య పరీక్షలు దంత వైద్య పరీక్షలు కూడా చేయడం జరుగుతుందని, వైరా పరిసర ప్రాంతాల ప్రజలు, ముఖ్యంగా వైద్య పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం సంప్రదించాల్సిన నెంబర్లు 9492093279, 9666882614 అని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతనిప్పు రాంబాబు, మెదరమెట్ల శ్రీనివాసరావు, చావా శ్రీనివాసరావు, సూర్యదేవర శ్రీధర్, వాసిరెడ్డి రమేష్, ఏనుగు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ 9వ వార్డు రాజశేఖర్ నగర్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఈ వేడుకల్లో వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, కల్పన దంపతుల కూతురు వేదితసేన, కొడుకు సంజీవ్ పార్థుతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొని మహిళలతో కలిసి కోలాటం నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం బతుకమ్మ కమిటీ నిర్వాహకులకు, చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కట్ల సంతోష్ కల్పన దంపతులు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు తెలంగాణలో ప్రతి ఆడపడుచు ఎంతో ఆనందోత్సాహాలతో జరుపుకునే ఈ పండుగ మహిళల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతిరూపమని తెలిపారు. ఇలాంటి సంప్రదాయ పండుగలను భావితరాలకు అందించేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి కిరణ్, పైడిపల్లి శ్రీనివాసరావు, విలాసాగరం నరేష్, పసుపులేటి సురేష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటా సర్వేను పరిశీలించిన తహసీల్దార్



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : పువ్వాడ నగర్ గ్రామ పంచాయతీలో చేపట్టిన ఇంటింటా సర్వేను రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత పరిశీలించారు. గురువారం తహసీల్దార్ శ్వేత పువ్వాడ నగర్‌లో జరుగుతున్న సర్వేను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అధికారులు, గృహ వాసులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే సిబ్బందికి గృహ వాసులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఎటువంటి అపోహలు, భయాందోళన చెందకుండా సర్వేకు వచ్చిన వారికి పూర్తి స్థాయిలో తమ వివరాలను వెల్లడించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు ప్రవీణ్, జగదీష్, సర్వే బృందం సభ్యులు పాల్గొన్నారు.

## మెకానిక్ కుటుంబానికి ఆర్థికసాయం



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : టూ వీలర్ మెకానిక్ కుటుంబానికి ఖమ్మం కార్పోరేషన్ టూ వీలర్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో రూ. 10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఖమ్మం నగరంలో 30 ఏళ్లుగా మెకానిక్ వృత్తిలో కొనసాగుతున్న ఖుషిద్ భార్య అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. ఆమె మృతి వార్త తెలుసుకున్న యూనియన్ అధ్యక్షులు వంగాల కొండలరావు ఆధ్వర్యంలో యూనియన్ బాధ్యులు ఖుషిద్ స్వగృహంకు వెళ్లి ఆమె భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. తక్షణ సాయంగా రూ. 10వేల చెక్కును యూనియన్ తరుపున అందజేశారు.ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు కొండలరావు మాట్లాడుతూ యూనియన్ సభ్యత్వం కలిగిన ప్రతి మెకానిక్‌కు ఏ సమస్య వచ్చిన యూనియన్ తరుపున అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లింగనబోయిన మురళి, వర్కింగ్ ప్రెసిడెంట్ బుల్లెట్ అన్వర్, కోశాధికారి బల్లి నాగేశ్వరరావు, ప్రచార కార్యదర్శి షేక్ సుభాని, బైరవ శేషు, మేడి పాండు, అన్నదేవర భద్రం, నాగులమీరా, మెకానిక్‌లు పాల్గొన్నారు.

## అమ్మవారి మండపం వద్ద అన్నదానం



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : దేవీ నవరాత్రోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. గురువారం మండల పరిధిలోని పువ్వాడ నగర్‌లో శ్రీదేవి దుర్గామాత ఉత్సవ కమిటీ వార్షికోత్సవ సందర్భంగా అమ్మవారి విగ్రహం వద్ద మహా అన్నదానాన్ని నిర్వహించారు. బిఆర్ఎస్ నాయకులు గొలుసుల నర్సింహారావు ఆహ్వానం మేరకు బిఆర్ఎస్ మండల నాయకులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో నాయకులు గుత్తా రవి, మెంటెం రామారావు, కొంటెముక్కుల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు విశేష స్పందన




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : 20వ జిల్లా స్థాయి జాతీయ అంతర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించిందని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు మందుల వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం సర్దార్ పటేల్ మైదానంలో 14, 16 ఏళ్ల లోపు విభాగాలలో నిర్వహించిన ఈ పోటీలకు 150 మంది బాల బాలికలు పాల్గొన్నారు.ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు నిశాంత్, విశిష్ట అతిథిగా డివైఎస్‌వో సునీల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీల్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులకు సర్దార్ పటేల్ మైదానంలో 20 రోజుల పాటు వసతితో కూడిన ప్రత్యేక శిక్షణ అందించి జాతీయ పోటీలకు పంపుతామన్నారు. గతంలో జాతీయ స్థాయిలో రెండు కాంస్య పతకాలను సాధించిన క్రీడాకారులను సన్మానించారు. నవంబర్ 14 నుంచి జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఖమ్మంజిల్లా నుంచి 13 మంది బాలబాలికలను ఎంపిక చేసినట్లు మందుల వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు కె. మహేందర్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి క్రిస్టఫర్ బాబు, కోశాధికారి ఉప్పల్‌రెడ్డి, ప్రొ॥ డా॥ బి. వెంకన్న, చీఫ్ కోచ్ మహ్మద్ గౌస్, అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్ కృష్ణయ్య, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రంజాన్ పాల్గొన్నారు.

# ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి న్యాయం చేయాలి

**- ఎన్నికల నాటి హామీని ముఖ్యమంత్రి నెరవేర్చాలి**
**- పశ్య పద్మ**




**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసి తక్షణమే న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. గురువారం కొత్తగూడెంలోని సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో జిల్లా అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యాతిధిగా హాజరైన ఆమె మాట్లాడుతూ 200515 మధ్య కాలంలో అగ్రిగోల్డ్ సంస్థ తెలుగురాష్ట్రాల్లో పేదలు రైతుల నుండి రూ.600 కోట్లకు పైగా వసూళ్లు చేసి ఘరానా మోసానికి పాల్పడిందన్నారు. ఒక్క తెలంగాణలోనే సుమారు 3 లక్షల మంది బాధితులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వంద రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటికైనా ఆ హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని బాధితులకు న్యాయం చేసేందుకు 35444 మంది భూములను నిషేధిత జాబితా నుండి తొలగించిన మాదిరిగానే తెలంగాణాలోనూ తక్షణ నిర్ణయం తీసుకోవాలన్నారు. కంపెనీ వెంచర్లలో పేదలు కొనుగోలు చేసి ఇప్పటికే రిజిస్ట్రేషన్ పూర్తయిన ఇండ్ల స్థలాలను అటాచ్‌మెంట్ జాబితా నుండి తొలగించి బాధితులకు అప్పగించాలన్నారు. ఏళ్ల తరబడి బాధితులు ఏజెంట్లు ఆవేదనతో బ్రతుకుతుంటే పాలకులు మొద్దునిద్ర వీడకపోవడం దారుణమన్నారు. బాధితల పక్షాన జరిగే రాజీలేని పోరాటాలకు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సంపూర్ణ మద్దతుగా నిలుస్తుందని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, రైతు సంఘం జిల్లనాయకులు వైఎస్ గిరి, తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నాయకులు, బాధితులు, ఏజెంట్లు తదితర్లు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం

**-లబ్దిదారు గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న ఎంఎల్‌ఏ పాయం**



**ప్రజాపక్షం/గుండాల:** పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని పినపాక ఎంఎల్ఏ, తెలంగాణ శాసన సభ ఎస్టీ సంక్షేమ కమిటీ ఛైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గుండాల మండలం ముత్తాపురం గ్రామ పంచాయితీ పరిధిలో లబ్దిదారు తురుబాక నాగేంద్ర నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ సొంత ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవం, భవిష్యత్తుపై భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన నిరుపేద కుటుంబాలకు పక్కా గృహాలు అందించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో పేదల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సంగీత, ఎంపీడీవో బాలరాజు, హౌసింగ్ ఏఈ రాజేష్, ఏవో వెంకటరమణ, ఎంపీవో త్రిలోక్, పంచాయితీ కార్యదర్శి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పొంబోయిన ముత్తయ్య, జిల్లా కార్యదర్శి ఎస్‌కె ఖదీర్, మండల అధ్యక్షుడు ఊకె బుచ్చయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధార అశోక్, పడుగోనిగూడెం సర్పంచ్ ఈసం సంజీవరావు, రోళ్లగడ్డ సర్పంచ్ భూక్య మంగమ్మ, శెంబునిగూడెం సర్పంచ్ ఈసం సుమలత, శెట్టుపల్లి సర్పంచ్ ఢిల్లీ వసంతరావు, దామరతోగు సర్పంచ్ కల్తి కృష్ణారావు, మాజీ ఎంపీపీ చాట్ల పద్మ, మండల నాయకులు ఎస్‌కె అబ్దుల్ నభి, వంకుడోత్ బీకోజీ, భూక్య శ్రీను, ఎస్‌కె వాజీద్ పాషా, ఎస్‌కె కాసీం, పోలెబోయిన బాబురావు, వంకుడోత్ రమేష్, ఎస్‌కె ఇశ్రార్, బొంగు చంద్రశేఖర్, పల్లపు రాజేష్, వార్డు సభ్యులు ఈసం చంద్రయ్య, జాటోత్ వీరన్న, బానోత్ నరేందర్, బోడ వెంకట్రామ్, ఇతర నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మత్స్య రైతులకు నైపుణ్య శిక్షణ పూర్తి

**-దేశవాళీ కార్ప్ చేపల పెంపకం, యాజమాన్యంపై అవగాహన**



**ప్రజాపక్షం/కూసుమంచి:** పాలేరు మత్స్యపరిశోధన స్ధానం ఆధ్వర్యంలో, జాతీయ మత్స్య అభివృద్ధి మండలి ఆర్థిక సహకారంతో తెలంగాణ మత్స్య రైతులు, మత్స్యకారులకు నిర్వహించిన మూడు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ గురువారం ముగిసింది. రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, నాగర్ కర్నూల్, ఖమ్మం జిల్లాల నుంచి 25 మంది పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా సూర్యాపేట జిల్లా మత్స్యశాఖ అధికారి డి ఆంజనేయస్వామి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న మెలకువలను పాటించి, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాలేరు మత్స్య పరిశోధన స్థానం అధిపతి, సీనియర్ మత్స్యశాస్త్రవేత్త డాక్టర్ ఎం శ్యాం ప్రసాద్ శిక్షణ అంశాలను ఆచరణలో పెట్టి లాభాలు పొందాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ మత్స్య విశ్వ విద్యాలయ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి విద్యాసాగర్‌రెడ్డి చేపల పట్టుబడి, మార్కెటింగ్, జాతీయ మత్స్య డిజిటల వేదికపై వివరించారు. మత్స్య శాస్త్రవేత్త బి రవీందర్ చేపల వ్యాధుల నివారణ, మందులు, శానిటైజర్లు, మేత వినియోగంపై క్షేత్రస్ధాయి శిక్షణ ఇచ్చారు. ఫిసరీస్ యంగ్ ప్రొఫెషనల్ బి దివ్య చేపల వ్యాధులు, ప్రభుత్వ సబ్సిడీ పథకాలపై అవగాహన కల్పించారు. ముగింపులో పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

# పోలీస్ స్టేషన్ నుంచే గ్రామాలపై నిఘా

**-లక్ష్మీ నగర్, ములకపాడులో సీసీ కెమెరాల పర్యవేక్షణ ప్రారంభించిన డీఎస్పీ**



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** లక్ష్మీ నగర్, ములకపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పర్యవేక్షణ వ్యవస్థను భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ గురువారం దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్‌లో ప్రారంభించారు. గ్రామాల్లో అనుమానాస్పద కార్యకలాపాల గుర్తింపు, నేరాల నియంత్రణ, ఛేదనకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించిన వ్యాపారులను సన్మానించారు. అనంతరం పోలీస్ స్టేషన్ రికార్డులు, పరిసరాలను పరిశీలించి సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదులను బాధ్యతాయుతంగా పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో దుమ్ముగూడెం సీఐ వెంకటప్పయ్య, ఎస్ఐ జగన్మోహన్ చారి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సీలింగ్ భూముల రీ సర్వే పనుల పరిశీలన



**ప్రజాపక్షం/ఇల్లందు:** భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి క్షేత్రస్థాయిలో సర్వే పనులను పరిశీలిస్తున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్డీవో మధు తెలిపారు. గురువారం మామిడిగుండాల గ్రామ పంచాయితీ పరిధిలో కొనసాగుతున్న సీలింగ్ భూముల రీ సర్వేను పరిశీలించి, సర్వేయర్లు, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సంధ్య, ఆర్ఐ బాషా, సర్వేయర్ ప్రియాంక, జీపీఓ సత్యనారాయణ, ప్రకాశ్, సర్పంచ్ ఎట్టి రమణ వీరభద్రం, పంచాయితీ కార్యదర్శి లక్ష్మీ నారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పింఛన్ దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు మండలంలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్దిదారుల అర్హతలపై రెండో రోజు విచారణ కొనసాగింది. జిల్లా పంచాయితీ అధికారి డిప్యూటీ సీఈవో అప్పారావు గురువారం పలు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. చల్లసముద్రం పంచాయితీతో పాటు మామిడిగుండాల, బోయితండా, మసివాకు, ముత్తారపుకట్ట, రాఘబోయినగూడెం, మర్రిగూడెం, మిట్టపల్లి, రొంపేడు గ్రామ పంచాయితీల్లో పంచాయితీ కార్యదర్శులు రూపొందించిన జాబితాల ఆధారంగా విచారణ నిర్వహించారు. దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి కుటుంబ వివరాలు, అర్హత ప్రమాణాలు, ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేశారు.

# ప్రమాదంలో గాయపడ్డ వర్కర్లకు ఆర్థికసాయం



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలం పరిధిలోని పుట్టకోట గ్రామానికి చెందిన బలుగూరి నరసింహారావు పని పూర్తి చేసుకొని ఇంటికి వస్తున్న క్రమంలో యాక్సిడెంట్ జరిగింది. వైద్య ఖర్చులు నిమిత్తం రూ. 6,000/లు ఆర్థిక సహాయం అందజేశారు. పాపకొల్లు గ్రామానికి చెందిన నిమ్మటూరి రాము పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు చెయ్యి విరగగా వారి ఆర్థిక అవసరాలను గుర్తించిన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) మండల నాయకత్వం స్పందించి వారికి రూ. 3000/లు ఆర్థిక సహాయం చేశారు. వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు గుడిమెట్ల సీతయ్య, కరీముల్లా, వేముల నరసింహారావు, చింతపట్ల కృష్ణ, పురేటి సత్యనారాయణ, మోటపోతుల కృష్ణ, బట్టు నరసింహారావు, కాశీ మల్ల కిరణ్, గతం కాంతారావు, బోర్ర రాంబాబు, ముత్తయ్య, వీరయ్య పాల్గొన్నారు.

# ఘనంగా అలిగిన పూల బతుకమ్మ



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండలం మునిగేపల్లిలో గురువారం అలిగిన పూల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని దుర్గామాత విగ్రహం వద్ద సర్పంచ్ గంగా స్రవంతి రవి, ఉప సర్పంచ్ గార్లపాటి శంకర్, కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. బతుకమ్మ సంప్రదాయాలను కొనసాగిస్తూ గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. వేడుకలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

# ఎంఎల్‌సీ ఓటరు నమోదుకు దరఖాస్తుల ఆహ్వానం



**ప్రజాపక్షం/కూసుమంచి:** వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎంఎల్‌సీ నియోజకవర్గ ఓటరు జాబితాలో పేర్ల నమోదుకు అర్హులైన పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ లేదా సమాన అర్హత పూర్తి చేసిన వారు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చుని, దరఖాస్తుల సమర్పణకు నవంబర్ 6 చివరి తేదీగా పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ డి సైదులు, ఎంపీడీవో టి జస్వంత్ కుమార్, నాయబ్ తహసీల్ధార్ పటాన్ ఖాజా మొహినుద్దీన్ ఖాన్, ఎంపీవో హనుమంతరావు, మండల గిర్ధావర్ రాము, జ్యోతి, జీపీవోలు, గ్రామ పంచాయితీ కార్యదర్శులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

# సన్న ధాన్యం రకాల గుర్తింపుకు ప్రత్యేక చర్యలు

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** వానాకాలం ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం ఏడు గుర్తింపు పొందిన సన్న ధాన్యం రకాలను ప్రోత్సహిస్తూ ఆ రకాలను సాగు చేసిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ అందించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ సక్రమంగా అందేలా ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల వద్ద గుర్తింపు పొందిన సన్న ధాన్యం రకాల గుర్తింపు, ధృవీకరణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. కొనుగోలు సమయంలో ధాన్యం రకాన్ని సక్రమంగా గుర్తించి అర్హులైన రైతులకు మాత్రమే బోనస్ ప్రయోజనాలు అందేలా చూస్తామన్నారు. జిల్లాలోని ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం రకాలను గుర్తించడంలో నైపుణ్యం కలిగిన ఒక సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా ఈ విధుల్లో పాల్గొనే అర్హత కలిగిన సిబ్బందికి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పారితోషికం అందిస్తామని తెలిపారు.వ్యవసాయంలో బియస్సి లేదా డిప్లొమా అర్హత కలిగిన వ్యక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సంబంధిత మండల వ్యవసాయ అధికారి, విస్తరణ అధికారులను సంప్రదించాలన్నారు. నియమిత సిబ్బంది ధాన్యం కొనుగోలు సంస్థలకు సహకరిస్తూ సన్న ధాన్యం రకాల గుర్తింపు ధృవీకరణ ప్రక్రియలో భాగస్వాములు అవుతారని వ్యవసాయ అధికారి తెలిపారు.

# సాగుకు నీటి గండం

**-పంటల బీమా పథకం లేక ఇబ్బందులు**
**-తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ**

**ప్రజాపక్షం/ కొణిజర్ల :** ఎల్‌నినో ప్రభావంతో సాగుకు నీటి గండం ఏర్పడుతుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ తెలిపారు. గురువారం మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సభ్యత్వ కార్యక్రమాన్ని పశ్య పద్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎల్‌నినో ప్రభావ పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికాబద్ధంగా కరువు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని నీళ్లు లేక పంటలు ఎండి పోతున్నాయన్నారు. బోర్లలో నీరు ఉన్న కరెంటు కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో పంటల బీమా పథకం లేకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బీమా పథకాన్ని కొనసాగించాలన్నారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఖమ్మంజిల్లాకు సాగు, తాగునీటికి అవకాశాలు దూరమవుతున్నాయన్నారు. తక్షణమే సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేసి పాలేరుకు గోదావరి జలాలను అనుసంధానం చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన రైతులను చైతన్యవంతులను చేసి పోరాటాలకు సిద్ధం చేయాలన్నారు.



ప్రస్తుత రబీ సీజన్‌కు ప్రభుత్వాలు సూచిస్తున్న సూచనలను పాటిస్తూ పంటల సాగు చేపట్టాలన్నారు. రెండు లక్షలకు పైగా ఉన్న రుణమాఫీని తక్షణమే అమలు చేయాలన్నారు. కరువు పరిస్థితుల్లో రైతులకు 14 రకాల నిత్యావసర వస్తువులను ప్రజాపంపిణీ ద్వారా పంపిణీ చేయాలన్నారు. విబి జీ రాంజీ పథకాన్ని వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడేవిధంగా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, సిపిఐ మండల కార్యదర్శి గడల భాస్కర్, రైతు సంఘం నాయకులు పెదమాళ్ల రత్తయ్య, దేరంగుల లక్ష్మయ్య, యాసా వెంకటేశ్వర్లు, గోపాలరావు, నర్సారావు, అడపా కృష్ణయ్య, వెంకన్న, దేరంగుల వెంకన్న, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# అధికారులకు దళారులకు కనకవర్షం కురిపించిన భూ సేకరణ

**-భూ సేకరణ మాయాజాలంలో బినామీలకే పెద్దపీట**
**-రెవెన్యూ చట్టాలను కూడా తుంగలో తొక్కిన అధికారులు**
**- పెద్దన్న పాత్రను పోషించిన బాండ్ పేపర్లు**

**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి మణుగూరు ఏరియాలోని మణుగూరు ఓసి విస్తరణ భూ సేకరణ అధికారులకు, దళారులకు కనక వర్షం కురిపించింది. 813 ఎకరాల భూ సేకరణ నిర్వాసితుల జాబితాలో 1506కి చోటు కల్పించి భారీ కుంభకోణాన్ని నడిపించారు. నిజమైన రైతులను తుంగలో తొక్కి బినామీలకు పేద పీటవేసి కోట్లు దండుకున్నారు. వ్యవసాయ భూమి కుంటలగా ఎక్కడైనా ఉంటుందా... కానీ ఈ భూసేకరణలో నిర్వాసితల పేరు మీద రెండు కుంటల నుండి 19కుంటల వరకు ఉనట్లుగా నోటిఫికేషన్‌లో అధికారులు చూయించారు. రెండు కుంటల్లో ట్రాక్టర్ తిరుగుతుందా,ఇంటి స్థలాలు అయితే కుంటల్లో ఉంటుంది కాని వ్యవసాయ భూమి ఉంటుందా. ప్రతేకంగా రెండు కుంటల్లో వ్యవసాయం చేయటం సాద్యమా.. అది అధికారులకే తెలియాలి. మణుగూరు ప్రాంతానికి సంభందంలేని ములుగు, ఖమ్మం, మహబూబాబాద్‌తో పాటు ప్రక్క రాష్ట్రలో ఉన్నవారు కూడ నిర్వాసిత జాబితాలో చోటు సంపాదించారు.



### పెద్దన్న పాత్రను పోషించిన బాండ్ పేపర్లు...

భూ సేకరణలో పాత బాండ్ పేపర్లు పెద్దన్న పాత్రను పోషించారు. 3 నుండి 4 సంవత్సరాల పాత పేపర్లను సంపాదించి, వాటి ద్వారానే విక్రయాలు జరిగాయని, వాటి ఆధారంగానే నిర్వాసితుల జాబితా తయారు చేశారని, పాత బాండ్ పేపర్లను బయటి పట్టణాల నుండి తీసుక వచ్చి ఒకోక పేపరును 20 నుండి 30వేల రూపాయల వరకు ధర పలికిందనే ఆరోపణలు ఉన్నాయి . సబ్‌రిజిస్ట్రార్ కార్యాయలం నుండి ఈ బాండ్ పేపర్లపై ఎంక్వైరీ చేస్తే చాలా వరకు నిజాలు బయట పడే అవకాశాలు ఉన్నాయి. గత పది రోజులగా భూ సేకరణ కుంభకోణం పై అనేక ఆరోపణలు వస్తున్న రెవిన్యూ అధికారులు స్పందించకపోవటం పై పలు అనుమానాలు రెకేత్తుతున్నాయి. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి మణుగూరులో జరిగిన భూ సేకరణపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిని అధికారులపై చర్యలు తీసుకొవాలని నిర్వాసిత రైతులు కొరుతున్నారు.

# అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలతో భరోసా

**-స్మార్ట్ రేషన్ కార్డులు, కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ**



**ప్రజాపక్షం/గుండాల:** అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని పినపాక ఎంఎల్‌ఎ, తెలంగాణ శాసన సభ ఎస్టీ సంక్షేమ కమిటీ ఛైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గుండాల మండలంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద, మధ్య తరగతి కుటుంబాలకుఅండగా నిలుస్తున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పథకాల ప్రయోజనాలు అందించి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యమన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్ సేవలు మరింత సులభతరం కానున్నాయని పేర్కొన్నారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాల సమయంలో ఆర్థిక భారం తగ్గించేందుకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలు ఉపయోగపడుతున్నాయని ఎంఎల్‌ఎ అన్నారు. అర్హులైన లబ్దిదారులకు ఆర్థిక సాయం అందించడం ద్వారా ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోందని తెలిపారు. సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో గుండాల తహసీల్దార్ సంగీత, ఎంపీడీవో బాలరాజు, హౌసింగ్ ఏఈ రాజేష్, ఏవో వెంకటరమణ, ఎంపీవో త్రిలోక్, పంచాయితీ కార్యదర్శి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పొంబోయిన ముత్తయ్య, జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఖదీర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఊకె బుచ్చయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధార అశోక్, పడుగోనిగూడెం సర్పంచ్ ఈసం సంజీవరావు, రోళ్లగడ్డ సర్పంచ్ భూక్య మంగమ్మ, శెంబునిగూడెం సర్పంచ్ ఈసం సుమలత, శెట్టుపల్లి సర్పంచ్ ఢిల్లీ వసంతరావు, దామరతోగు సర్పంచ్ కల్తి కృష్ణారావు, మాజీ ఎంపీపీ చాట్ల పద్మ, నాయకులు ఎస్‌కే అబ్దుల్ నభి, వంకుడోత్ బీకోజీ, భూక్య శ్రీను. ఎస్‌కే వాజీద్ పాషా, ఎస్‌కే కాసీం, పోలెబోయిన బాబురావు, వంకుడోత్ రమేష్, ఎస్‌కే ఇశ్రార్, బొంగు చంద్రశేఖర్, పల్లపు రాజేష్, వార్డు సభ్యులు ఈసం చంద్రయ్య, జాటోత్ వీరన్న, బానోత్ నరేందర్, బోడ వెంకట్రామ్, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన సండ్ర

**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం నారాయణ పురం గ్రామంలో గొడుగునూరి బాలరెడ్డి, ఝాన్సీ దంపతుల కుమార్తె మేరీ మగ్దలేనా మ్యాగీ, కమల్ చంద్ వివాహ వేడుకలో బిఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ ఎంఎల్‌ఎ సండ్ర వెంకట వీరయ్య పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, తల్లాడ మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, మండల పార్టీ కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్ లాల్, బిఆర్‌ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షులు జివిఆర్, తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, దేవేందర్, ముఖ్య నాయకులు, యువత పాల్గొన్నారు.



# గ్రామ సమైక్య భవనం పనులు వేగవంతం చేయాలి

**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామ సమైక్య భవన పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో ఉన్న వాలీబాల్ కోర్టును కల్లూరు రోడ్డులోని గ్రామీణ క్రీడా ప్రాంగణానికి తరలించాలని కోరుతూ టిడిపి మండల అధ్యక్షుడు సరికొండ శ్రీనివాసరాజు, తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు తొండపు రవికుమార్ లు గురువారం ఎంపిడివో అంబటి శ్రీధర్‌రాజు, ఈవో హరికృష్ణ, ఎంఆర్‌వో పి. కరుణాకర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో గ్రామ సమైక్య భవనాలను నిర్మించేందుకు తగు చర్యలు చేపట్టిందన్నారు. కొన్ని కారణాలతో పనులు నిలిచిపోవడంతో గ్రామ మహిళా సంఘాలకు ఉపయోగపడే భవనం అందుబాటులోకి రావడం ఆలస్యమవుతుందన్నారు. గ్రామాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని నిలిచిపోయిన నిర్మాణ పనులను వెంటనే పునః ప్రారంభించి



త్వరితగతిన పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను వినతి పత్రంలో కోరారు. వాలీబాల్ ఆటలను వీక్షించేందుకు వచ్చే కొందరి మధ్య బెట్టింగ్‌లు జరుగుతున్నాయనే ఆరోపణలు వినవస్తున్నాయన్నారు. ఈ విషయమై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని వారు కోరారు.

# తల్లాడలో జూనియర్ కళాశాల, న్యాయస్థానం ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, న్యాయస్థానం కోర్టు ఏర్పాటు చేయాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు డిఆర్‌కె రాజు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఆరు కోర్టులు మంజూరు చేసిందన్నారు. ఒకప్పుడు పక్కన ఉన్న ఏన్కూరు, కల్లూరు, వైరా మండలాలు చాలా వెనుకబడి ఉండేవన్నారు. ప్రస్తుతం అవి చాలా అభివృద్ధి చెందాయన్నారు. ఎన్నో ఏళ్లుగా తల్లాడ మండల కేంద్రం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గత పదేళ్ల కాలంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం తల్లాడ అభివృద్ధికి చేసింది ఏమి లేదన్నారు. అంతకు ముందు తల్లాడ మండలం మధిర నియోజక వర్గంలో ఉండేదని అప్పుడు కూడా మండల అభివృద్ధి జరగ లేదన్నారు. జూనియర్ కళాశాల, కోర్టు ఏర్పాటుకు కృషి చేసి మండల అభివృద్ధికి తోడ్పాడాలని రాజు కోరారు. ఈ ఏర్పాటులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లు సహాయ సహకరాలు అందించాలని ఆయన కోరారు.



# లైసెన్స్ లేని వ్యాపారులపై చర్యలు

**ప్రజాపక్షం/కారేపల్లి:** లైసెన్స్ లేకుండా వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసే వ్యాపారులపై దాడులు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఎ అలీమ్ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇల్లందు మార్కెట్ పరిధిలోకి సింగరేణి మండలం వస్తుందని, అక్కడ పత్తి, ధాన్యం, మొక్కజొన్న, మిర్చి తదితర వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయాలనుకునే వ్యాపారులు తప్పనిసరిగా మార్కెట్ కమిటీ నుంచి లైసెన్స్



పొందాలని సూచించారు. లైసెన్స్ తీసుకున్న తర్వాతే పంట ఉత్పత్తుల కొనుగోలు, నిల్వలు చేపట్టాలని స్పష్టం చేశారు. లైసెన్స్ లేకుండా వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసే వ్యాపారులపై తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు, పశువుల మార్కెట్ల చట్టం 1966 ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. లైసెన్స్ కోసం మార్కెట్ కమిటీ కార్యదర్శిని సంప్రదించాలని వ్యాపారులకు సూచించారు.

# ఘనంగా ప్రపంచ కూచిపూడి దినోత్సవం

**ప్రజాపక్షం/మధిరః** మధిర పట్టణంలోని కళాసాధన నృత్య కళానికేతన్ నందు గురువారం డాన్స్ మాస్టర్ కళ్యాణపు నాగరాజు ఆధ్వర్యంలో ప్రపంచ కూచిపూడి నృత్య దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు కూచిపూడి కళ యొక్క ప్రాధాన్యతను గురించి క్లుప్తంగా వివరించారు. అలాగే కూచిపూడి కళ నేర్చుకోవడం ద్వారా చిన్నారులకు ఏకాగ్రత శక్తి పెరుగుతుందని తెలిపారు. అనంతరం చిన్నారుల ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి నృత్య గురువులు అమృత వర్షిని, డాన్స్‌స్కూల్ ఇంచార్ సింధు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

